ఉంటారు. చిన్నాగాడికి చాలా చాలా విషయాలు తెలుసు. వాళ్ళన్న దగ్గర డబ్బులు కాజేసి సినిమాలు చూస్తుంటాడు కదా. అచ్చం సినిమా చూపిస్తున్నట్లే చెప్తాడు.

ఇంకా వాడు తన దోస్త్ కటీఫ్ కదా. తన గురించి ఉన్నవీ లేనివీ కల్పించి చెప్పి మిగతా వాళ్ళని నవ్విస్తూ ఉండొచ్చు. వాడి కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి. పరుగెత్తుకుంటూ వెళ్ళి తన దోస్తులతో ఆడుకోవాలనే బలమైన కోరిక . . . అమ్మ కొట్టినా పర్లేదు . . . సేర్ కూడా కొడ్తాడా . . . ఎలా కొడ్తాడు? తను దొరక్కుండా పారిపోతాడు కదా. వాడి బోడి డ్రెస్సు . . . కుళ్ళిన కంపుకొడ్తున్న ఈ డ్రెస్ ఎవడిక్కావాలి? దీన్ని దొంగిలించుకుని పోతున్నాననుకుంటాడేమో? అందుకే సగం దూరం వెళ్ళి డ్రెస్ విప్పేసి వాడి మొహంమీద కొట్టి "నీ ఏభై రూపాయలూ వద్దు. ఈ ఎలుక మొగమూ వద్దు. అన్నీ నీ దగ్గరే ఉంచుకో" అంటూ లగెత్తుకుంటూ వెళ్ళిపోతాడు.

కానీ పాపం బాబాయ్ . . . మంచివాడు . . . ఓసారి బోనాలప్పుడు హోటలుకి పిలుచుకెళ్ళి దోశె తిన్పించాడు. సేర్ బాబాయిని తిడ్తాడు. పని లోంచి తీసేసినా తీసేసే రకంలానే ఉంది వాడి మొకం. బాబాయి కోసమైనా భరించాలనుకున్నాడు. పది నిముషాలు దాటంగానే ఇక ఎవ్వరి కోసమూ భరించలేననుకున్నాడు.

వాడికి జైల్లో ఉన్నట్లనిపించింది. ఎవడో కుర్రాడు తోకదగ్గర పట్టుకుని లాగి పకపకా నవ్వుతున్నాడు. వాడికీ పదేళ్ళే ఉంటాయి. దాదాపు తన ఈడే. ఎంత మంచి బట్టలు వేసుకున్నాడో . . . మొహంలో నిగారింపు . . . ధగధగా మెరిసిపోతూ కళ్ళు . . . కానీ బుద్ధే . . . వంకరగా ఉంది. షేక్‌హాండ్‌కని చేయి చాపి తన చేతిని పట్టుకుని బలంగా గుంజాడు. చేయి విరిగి పోయిందేమోననిపించింది. అమ్మా అంటూ తను చిన్నగా అరిచాడు. పెద్దగా అరిస్తే సేర్‌కి కోపం వస్తుందేమోననే భయం . . .

"నేనేం చేసినా మిక్కీమౌస్ నవ్వుతూనే ఉంది చూశావా" అన్నాడు వాడిపక్కనే ఉన్న అమ్మాయితో. శీను వస్తున్న ఏడుపుని బలవంతంగా దిగమింగుకున్నాడు. వాడి మీద పీకల్దాకా కోపం వచ్చింది. పట్టుకుని తన్నాలనిపిస్తోంది. బట్టలు కొనుక్కుని వెళ్తూవెళ్తూ వాడు తన కాలిమీద గట్టిగా కొట్టి నవ్వాడు. వాడు రోడ్డుమీదికి వెళ్ళాక టాటా చెప్పాడు. శీను వాడికి తిరిగి టాటా చెప్పకూడదనుకున్నాడు. ఆ విధంగానైనా వాడి మీద తనకున్న కసిని, అసహ్యాన్ని వ్యక్తపర్చాలనుకున్నాడు. కానీ సేర్ తనవైపే చూస్తున్నాడు. తప్పదు. అయిష్టంగానే తనూ చేతులు వూపాడు.

మరో గంట గడిచింది. వాడింకా నిలబడలేని స్థితికి వచ్చాడు. కాళ్ళు వణుకుతున్నాయి. కళ్ళు తిరిగి పడిపోవటం ఖాయమనుకున్నాడు. ఏమయితే అయింది. ఇక్కడే ఓ నిమిషం కూచోవాలన్న తెగింపు వాడిలో . . . షాపులో రద్దీ పెరిగింది. చేతులుకూడా వూపీ వూపీ నెప్పులు పుడ్తున్నాయి.

కుడి కాలిమీద నిలబడి ఎడమ కాలిని ఎత్తి దానికి రెస్ట్ ఇచ్చే ప్రయత్నం చేశాడు. కొద్దిసేపుండి ఎడమ కాలిమీద నిలబడే ఫీట్ చేసాడు. అదీ ఏమాత్రం సౌకర్యంగా అన్పించలేదు.

ఇంకెంతసేపు నిలబడాలో తెలీటంలేదు. షాపు ఎన్నింటికి మూస్తారో? ఇప్పుడు టైం ఎంతయిందో? వాడికి ఆకలనిపించింది. కరకర మండుతూ ఆకలి . . . దాహం కూడా అన్పించింది. షాపులోకి వెళ్ళి మంచి నీళ్ళడగొచ్చా . . . ఎవర్నడగాలి? బాబాయినే అడిగితేనో . . . తలతిప్పి బాబాయి వైపు చూశాడు. ఒక్కసారి అతను తల తిప్పి తన వైపు చూస్తే దాహం అని సైగచేయాలని వాడి ఆలోచన . . . ఎంతసేపు చూసినా మెడ నొప్పెడుతోంది తప్ప బాబాయి వాడివైపు చూళ్ళేదు.

మరో అరగంట భారంగా గడిచింది. వాడికేదో అనుమానం . . . అమ్మో . . . ఇపుడొద్దు . . . అనుకున్నాడు. కాళ్ళు నొప్పెడితే భరించాడు. ఆకలనిపిస్తే అణచుకున్నాడు. కానీ ఇపుడెలా? వాడికి దేవుడు గుర్తొచ్చాడు. తమింట్లో ఉన్న ఆంజనేయ స్వామి. దేవుడా . . . అది మాత్రం రాకుండా చూడు అనుకున్నాడు.

కానీ అదే. అనుమానం బలపడుతోంది. చుట్టూ చూశాడు. ఎటుచూసినా లైట్ల కాంతిలో వెలిగిపోతున్న షాపులు తప్ప అందుకనువైన ప్రదేశం కన్పించలేదు. ఓ వేళ అటువంటి స్థలం దొరికినా ఈ ఎలుక డ్రెస్ విప్పదీస్తే తప్ప వీలుకాని పరిస్థితి . . . వాడికో అనుమానం వచ్చింది. ఎలుకలు పాస్‌కెళ్ళవా . . . మరి డ్రెస్‌ని ఇలా నిండుగా కప్పేసినట్లు కుట్టితే ఎలుక పాస్‌కెలా వెళ్తుంది? డ్రస్ కుట్టిన వాడికి బుర్రలేదనుకున్నాడు.

ఇందాక దాహం వేసినప్పుడు మంచినీళ్ళు తాగాలనుకున్న విషయం గుర్తొచ్చి భయమేసింది. ఇంకా నయం . . . బాబాయి తనవైపు చూళ్ళేదు. చూసుంటే తను చెంబుడు నీళ్ళు తాగి ఉండేవాడు. అప్పుడు ఇలా బిగపట్టి ఆపుకునే అవకాశం కూడా ఉండేది కాదు.

వాడికి రానురాను ఆ అవసరం బలపడ్తోంది... వాడిని భయపెడుతోంది. ఇపుడెలా

చేయాలి? షాపులో బాత్రూం లేదు. చుట్టుపక్కలెక్కడా ఉన్నట్లు లేదు. హోటల్లో ఉంటుంది. బాబాయి తనని పిల్చుకెళ్ళినపుడు చూశాడు.

పొట్ట ఉబ్బరిస్తోంది. ఇంకో నిమిషం సేపుకూడా ఆపుకోలేననుకున్నాడు. యాభై రూపాయలు ఇవ్వకున్నా పర్లేదని చెప్పి డ్రస్ విప్పదీసి ఇచ్చేసి ఇంటికి పరుగెత్తుకుంటూ వెళ్తూ దార్లో కానిచ్చేయాలనుకున్నాడు. వాడికి ధైర్యం చాల్లేదు. అసలు డ్రెస్ విప్పదీసే వరకూ ఆగేలా లేదు. తన నిక్కర్‌తోపాటు షాపువాళ్ళిచ్చిన డ్రెస్ కూడా ఖరాబయ్యేట్టుంది.

అమ్మ తిట్లు, నాన్న తన్నులు ఖాయం. చిన్నా అందరికీ చెప్పేస్తాడు. వాడి నోట్లో మాట దాగదు. "ఛీ. ఈడు సిగ్గులేకుండా నిక్కరంతా తడుపుకున్నాడ్రా" అంటూ అందరూ ఎగతాళి చేస్తారు. ఎంత అవమానం . . .

పళ్ళ బిగువున ఆపుకుంటున్నాడు. షేక్ హ్యాండ్లు, టాటాలు యాంత్రికంగా చెప్తున్నాడు. అతని ధ్యాసంతా షాపెప్పుడు కట్టేస్తారనే దాని మీదే ఉంది. ప్రాణం పోయేట్లుంది.

అప్పుడు పిలుపొచ్చింది. షాపు మూసే టైం అయినట్టుంది. లోపలికి ఎలా వెళ్ళాడో తెలీదు. డ్రెస్ ఎలా విప్పదీసాడో తెలీదు. అంతే. ఒకటే పరుగు. వెనకనించి బాబాయి "ఒరేయ్! డబ్బులు పట్టుకెళ్ళరా" అని పిలుస్తున్నా విన్పించుకోకుండా పరుగే పరుగు . . . వాడికా క్షణం కాళ్ళ నొప్పులు గుర్తుకు రాలేదు. ఆ అవసరం తీర్చుకోవటం తప్ప వాడికి మరేదీ ముఖ్యమైన విషయంగా అన్పించలేదు.

శీను అన్నం తింటున్నప్పుడు యాద్గిరి బాబాయి వచ్చాడు. యాభై రూపాయల నోటు అమ్మ చేతికిస్తూ "ఏ రోజు డబ్బులు ఆ రోజే ఇస్తారని చెప్పాను కదా. పిలుస్తున్నా వినకుండా వీడు పరుగెత్తుకుంటూ వచ్చాడు" అన్నాడు. శీనువైపు తిరిగి "రేపు ఐదుగంటలకు రావాలి. ఎందుకైనా మంచిది ఓ పది నిముషాల ముందే రా" అనేసి వెళ్ళిపోయాడు.

"అవి నేను సంపాయించిన పైసలు. నాకిచ్చేయి" అన్నాడు అమ్మతో.

"నువ్వేం చేసుకుంటావు బిడ్డా. నాకు శానా అవసరం. యింట్లోకి బియ్యం, పప్పులు కొనాల. రేపురేషన్ షాపుకెళ్తా"

"నీకే ఇచ్చేస్తానమ్మా. కొద్దిసేపు నా చేతిలో పట్టుకుంటాను. అంతే"

"సర్లే మొదట బువ్వ తిను" అందామె తన కొడుకు సంపాదనాపరుడైనందుకు మురిసిపోతూ.

అప్పటివరకూ కుక్కి మంచంమీద కూచుని బీడీ కాలుస్తున్న నాన్న లేచి నిలబడ్డాడు.

"గా పైసలిలా ఇయ్యవే. బైటికెళ్ళొస్తా" అన్నాడు.

"ఎందుకూ? తాగి తగలెయ్యటానికేనా...నేనివ్వ" అందామె నోటుని గుప్పిట్లో గట్టిగా పట్టుకుంటూ.

"ఇయ్యాల తాగనే. ఎప్పటిదో బాకీ ఉంది. పెతిరోజూ అడుగుతుంటే సెద్ద సిరాగ్గా ఉంది. బేగీ ఇచ్చేయి. కొట్టుమూసేసే టైమైంది".

"ఇయ్యి నీకిస్తే రేపు తింటానికి బువ్వుండదు. ఈటితో రేషన్ బియ్యం కొనాల"

"సీ నీయవ్వ! సారా కొట్టు బాకీ ఎవడు తీరుస్తడే... నీ అయ్యగాని తీరుస్తడా. బేగివ్వు. బైట శానాపన్లున్నాయి" అతను దగ్గరకొస్తూ అన్నాడు.

ఆమె కూచునే వెనక్కెనక్కు జరుగుతూ "నేనివ్వ" అంది.

"పైసలడిగితే ఇయ్యనంటావే . . . నీకెంత దైర్నమే" అంటూ కుడి కాలెత్తి ఈడ్చి తన్నాడు.

"సచ్చాన్రో దేవుడా" అంటూ పెద్దగా అరిచి గోడకు బంతిలా తన్నుకుని బాధతో ఉండలు చుట్టుకునిపోయింది.

అదే అదనుగా ఆమె చేతిలోని నోటుని లాక్కుని బైటికెళ్ళబోతున్న అతన్ని రెండు సన్నటి చేతులు కాళ్ళకు బలంగా చుట్టుకుని కదలకుండా ఆపేశాయి.

"అయి నా పైసలు . . . నా సంపాదన . . . నాయి నాకిచ్చేయి" అన్నాడు శీను. వాడి కళ్ళలో అప్పటికే నీళ్ళు . . .

"వదుల్రా నా కొడకా . . . " కాళ్ళను జాడించి వాడి డొక్కలో ఒక్క తన్ను తన్ని అతను బైటికెళ్ళిపోయాడు.

శీనుకి బాగా దుఃఖం వచ్చింది. వెళ్ళి అమ్మను లేపి కూచోబెట్టాడు.

వాడికారాత్రి జొరమొచ్చింది. వళ్ళంతా దద్దుర్లు . . . దురద . . . గోకితే మంట . . . కాళ్ళు విపరీతంగా గుంజుతున్నాయి. పీడకలలు . . . వాడి చుట్టూ వందలవేల ఎలుకలు . . . వాణ్ణి కొరికి . . . హింసిస్తూ . . . వాడి నాన్న మొహంతో ఓ ఎలుక వికృతంగా నవ్వుతోంది. మిక్కీమౌస్ మొహంలో ఇప్పుడు నవ్వులేదు. అది క్రూరంగా వాడిమీదబడి కొరుకుతోంది.

వాడు పెద్దగా కేక పెట్టిలేచాడు.

